క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి



తిరువూరు:పట్టణంలో నెలకొన్న పలు ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి మంజూరైన రూ. కోటి నిధులతో చేపడుతున్న పనులకు గురువారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ప్రతి రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయడంతో పాటు పక్కా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. తాగునీటి ఇక్కట్లు తీర్చేందుకు రూ.160 కోట్లతో కృష్ణా నదీ జలాలను సరఫరా చేయనున్నామని చెప్పారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, కోటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి



ఇబ్రహీంపట్నం:ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్‌గా ఇటీవల కాలంలో బాధ్యతలు స్వీకరించిన పి.నవీన్‌గౌతమ్‌ను వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్ల కోఆర్డినేటర్ లంకే అంకమోహనరావు, నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. సంస్థ అభివృద్ధికి అంకుఠిత దీక్షతో కృషిచేయాలని కోరారు. స్థానికులుగా పార్టీ పరంగా తమ వంతు సహకారం అందిస్తామన్నారు. నాయకులు నల్లమోతు చిన్నయ్య, ప్రకాష్, దయాకర్ పాల్గొన్నారు.

కూలీలకు పే స్లిప్‌లు ఇవ్వాలని వినతి

విస్సన్నపేట: ఉపాధిహామీ పథకంలో పనిచేసే కూలీలకు పేస్లిప్‌లు ఇవ్వాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి.నాగరాజు కోరారు. మండలంలోని ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలు తెలుసుకునేందుకు గురువారం పలు గ్రామాల్లో ఉపాధి కూలీలను కలవటం జరిగిందన్నారు. కాగా వారం వారం తాము చేసిన పనికి ఎంత నగదు వచ్చింది బ్యాంకుల్లో ప్రింట్ ఇవ్వటం లేదని, పేస్లిప్‌లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీలు కోరుతున్నారని పేర్కొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చింతలనర్వ(గంపలగూడెం): గంపలగూడెం-2 సచివాలయం పరిధిలో శుక్ర, శనివారాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో తిరువూరు శాసనసభ్యులు కె.రక్షణనిధి పాల్గొని ప్రభుత్వ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, పట్టణశాఖ అధ్యక్షుడు కొత్తగుండ్ల నరసింహారావు కోరారు. శనివారం వలంటీర్లకు అవార్డులు ప్రదానం చేస్తామని ఎంపీడీవో తెలిపారు.

వలంటీర్ వ్యవస్థతో విప్లవాత్మక మార్పులు

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, వేదికపై ప్రజా ప్రతినిధులు

మైలవరం:వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో గురువారం వలంటీర్లను సత్కరించి, అవార్డులు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థతో ప్రజల ముంగిటకే పాలన చేరువ అయిందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో దోపిడీ జరిగిందని విమర్శించారు. ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడినట్లు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను సైతం పణంగా పెట్టి వలంటీర్లు సేవలందించారని గుర్తు చేశారు. ఇదే స్ఫూర్తితో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చారని చెప్పారు. జగనన్న సంక్షేమ పాలనకు సారథులు వలంటీర్లేనన్నారు. క్షేత్ర స్థాయిలో వలంటీర్లు అందిస్తున్న సేవలు అజరామరం అన్నారు. జగనన్న తలపెట్టిన పేదరిక నిర్మూలన అనే యజ్ఞంలో వలంటీర్ల పాత్ర ఎంతో కీలకం అన్నారు. గత ప్రభుత్వానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి తేడాను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వానికి మంచి పేరు తెస్తున్నారని వలంటీర్‌లపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. మైలవరం నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, నాయకులు, వైఎస్సార్ శ్రేణులు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

తిరువూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు అందించడంలో వలంటీర్ల పాత్ర కీలకమని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం పట్టణంలోని వార్డు వలంటీర్లకు ప్రభుత్వం ప్రకటించిన సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రక్షణనిధి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేదల సంక్షేమ పథకాల అమల్లో పారదర్శకత లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీరు వ్యవస్థ గ్రామస్థాయిలో ప్రభుత్వ పాలన సజావుగా సాగేందుకు తోడ్పడుతుందని చెప్పారు. వలంటీర్లపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత సమర్థవంతంగా పనిచేయాలని



తిరువూరు నగర పంచాయతీలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

కోరారు. వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు అందజేశారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, కోటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు

నూజివీడు: పట్టణంలో పారిశుద్ధ్యం మరింత మెరుగుపడాలని, అలాగే పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం సబ్‌కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా మైలవరం రోడ్డులోని పశువుల ఆసుపత్రి వద్ద, రైతుబజారు రోడ్డు, పీజీ సెంటర్ గోడలకు అందమైన చిత్రాలను వేయించి బ్యూటిఫికేషన్ చేయాలని సూచించారు. గుర్రంగేటు వద్ద పూలమొక్కలు వేసి సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్‌రషీద్‌ను ఆదేశించారు. పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాల భవనాల ప్రహరీలను రంగురంగుల బొమ్మలతో, సూక్తులతో అందంగా తీర్చిదిద్దాలన్నారు. రోడ్లపై చెత్త వేసే వారికి జరిమానా విధించాలని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ, మున్సిపల్ డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఏఈ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



నూజివీడులోని రైతుబజార్ రోడ్డులో పర్యటిస్తున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నేటి నుంచి కోటి శ్రీకృష్ణనామ జప యజ్ఞం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొవ్వూరు శ్రీరామానంద గౌడీయ మఠం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి వారం రోజుల పాటు పాతబస్తీలోని మద్ది సుబ్బారావు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రాంగణంలో కోటి శ్రీకృష్ణనామ జప యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ మఠం పీఠాధిపతి త్రిదండి స్వామి శ్రీ భక్తి విబుధ వామన మహారాజ్ చెప్పారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వశాంతి కోసం, లోకకల్యాణార్థం కోటి శ్రీకృష్ణ నామ యజ్ఞం, నామ జప యజ్ఞపూజ, సంకీర్తనోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సమాజంలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించటం ద్వారా శాంతిని వర్ధిల్లింపజేయటానికి తద్వారా మానవుల జీవితాలను సార్థకం చేయటానికి యజ్ఞం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకూ ప్రతిరోజూ తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ పూజలు, భజనలు, ఉపన్యాసాలు జరుగుతాయన్నారు. ప్రధానంగా దేశం నలుమూలల నుంచి హరేరామ మార్గంలో పయనిస్తున్న పలువురు ప్రముఖులు కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగాలు చేస్తారని చెప్పారు. జూన్ ఒకటో తేదీన పూర్ణాహుతితో యజ్ఞం ముగిస్తుందన్నారు. శుక్రవారం సాయంత్రం జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గోవింద మహారాజ్, నిష్కంచన మహారాజ్, వివేక బోధయన మహారాజ్, విష్ణు మహారాజ్, సుధీర దామోదర మహారాజ్, జనార్దన మహారాజ్, కృష్ణ బ్రహ్మచారి, కొలిపర మల్లీ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

బదిలీల ఆమోదం హర్షణీయం

ఇబ్రహీంపట్నం:గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం తెలపడంపై సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీపాషా గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో మూడున్నరేళ్లుగా ఎదురుచూస్తున్న సచివాలయ ఉద్యోగుల కల ఫలించిందన్నారు. ఉద్యోగరీత్యా భార్యా భర్తలు వేర్వేరు జిల్లాల్లో విధులు నిర్వహిస్తూ వారి పిల్లల చదువుల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతర్ జిల్లాల రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌కు అవకాశం కల్పించిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఆగిరిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జాస్తి జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని కనసానపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గురువారం వైద్యాధికారి ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వారికి ఉన్న సమస్యలను గుర్తించి సంబంధించిన మందులను పంపిణీ చేశారు.

ఉపాధి హామీ పథకం కూలీలకు వరం



నూజివీడు: ఉపాధి హామీ పథకం పేదలకు, రైతు కూలీలకు వరమని ఎంపీపీ ఆరేపల్లి శిరీష అన్నారు. మండలంలోని సిద్ధార్థనగర్‌లో ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువు పూడికతీత, నీటికుంట నిర్మాణ పనులను ఎంపీపీ శిరీష గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీలు ఉపాధి పనులకు క్రమం తప్పకుండా హాజరవ్వాలని కోరారు. వేసవిలో చెరువుల్లో పూడికను తొలగించడం వల్ల చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. చెరువు కట్టలను బలపరుచుకోవడం, సప్లయ్ చానళ్లు, ఫీడర్ ఛానళ్లు, పంట కాల్వలు, మట్టిరోడ్ల నిర్మాణం, మామిడి, ఎంపీడీవో అలీఖాన్, ఏపీవో సోమేశ్వరి, సర్పంచ్ బాణావతు చిలకమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు రామిశెట్టి కృష్ణ, ఆరేపల్లి రాంబాబు, బాణావతు రవి, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

హీల్ సంస్థకు రూ.2.10 లక్షల విరాళం

సాక్షి, అమరావతి: నిరాశ్రయులైన పేద విద్యార్థులకు ఉచిత విద్యావసతితో పాటు ఉద్యోగంలో స్థిరపడేంత వరకు అండగా నిలిస్తున్న అగిరిపల్లె హీల్ (హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ ఆల్) స్వచ్ఛంద సంస్థకు స్కూల్ లీడర్ షిప్ ట్రైనింగ్ రిసోర్సు పర్సన్లు రూ.2.10 లక్షల విరాళాన్ని అందించినట్లు సమగ్ర శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్షా, సీమ్యాట్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 24 వరకు జరిగిన స్కూల్ లీడర్ షిప్ శిక్షణ కార్యక్రమంలో అనేక జిల్లాల నుంచి వచ్చిన రిసోర్సు పర్సన్లు కలిసికట్టుగా సాయం అందించడం అభినందనీయమని చెప్పారు. సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య చేతుల మీదుగా చెక్కును హీల్ సంస్థ ప్రెసిడెంట్ లక్ష్మి, సీఈవో అజయ్ కుమార్‌కు అందించారు.

వైభవంగా అమ్మవార్ల విగ్రహాలు పునఃప్రతిష్ట

పొందుగల(మైలవరం):గ్రామంలో వేంచేసియున్న ముత్యాలమ్మ తల్లి, నిలువులమ్మ, సత్తెమ్మ తల్లి అమ్మవార్ల విగ్రహాల పునఃప్రతిష్ట మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. మహోత్సవానికి మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, ఆయన తనయుడు ధీమంత్ సాయి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సమస్త ప్రాణ కోటి సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించామన్నారు. భక్త కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వసంతకు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆడిటర్ సుంకర అక్కయ్యనాయుడు, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్. తిరుపతిరావు, ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి, డి. చలపతిరావు గ్రామస్తులు పాల్గొన్నారు.



అన్నదానంలో ఎమ్మెల్యే వసంత, సత్యనారాయణ రెడ్డి, అక్కయ్యనాయుడు తదితరులు

ఏపీ జెన్‌కో నూతన కార్యవర్గం ఎన్నిక

ఇబ్రహీంపట్నం:వీటీపీఎస్ ప్రాంతీయశాఖ, ఏపీజెన్‌కో సర్వసభ్య సమావేశం ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-1104 కార్యాలయంలో నిర్వహించారు. కొన్నేళ్లుగా పోరాడి సాధించుకున్న అంశాలను యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖరరావు వివరించారు. పెండింగ్‌లో ఉన్న పే రివిజన్ సాధనకు సంస్థ యాజమాన్యంతో చర్చలు సఫలం అవుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు ప్రస్తావించారు. నూతన కార్యవర్గం ఎన్నికలో జెన్‌కో అధ్యక్షుడిగా పీవీ కృష్ణయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఆర్.సతీష్‌కుమార్, కార్యదర్శిగా ఆర్. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా ఎ.కోటేశ్వరరావు, కోశాధికారిగా అయూబ్‌ఖాన్ ఎన్నికయ్యారు. ఎన్టీటీపీఎస్ ప్రాంతీయ ఎన్నికల్లో డి.వెంకటరమణ అధ్యక్షుడు, కార్యనిర్వాహక అధ్యక్షుడు సత్యనారాయణ, ఆర్.శ్రీనివాసరావు కార్యదర్శి, రామ్మోహనరావును కోశాధికారిగా ఎన్నుకున్నారు. నాయకులు జగదీశ్వర్, గణపతి పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో వీటీపీఎస్ రీజియన్, ఏపీ జెన్‌కో ఎన్నికల్లో నూతన కార్యవర్గం

పచ్చిరొట్ట సాగుతో భూసారం మెరుగు

నూజివీడు: పచ్చిరొట్ట సాగు వల్ల నేలలో పోషకాలు పెరిగి భూసారం పెరుగుతుందని సర్పంచ్ బొకినాల వెంకటేశ్వరమ్మ అన్నారు. మండలంలోని గొల్లపల్లి రైతు భరోసా కేంద్రంలో గురువారం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతుభరోసా కేంద్రం ఇన్‌చార్జి జి.కృపారాణి మాట్లాడుతూ ప్రభుత్వం 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తుందని చెప్పారు. వీటిని రైతులు తీసుకుని సాగు చేసిన తరువాత 40 రోజులకు నీళ్లు పెట్టి భూమిలో కలిపి దున్నుకోవాలన్నారు. దీని వల్ల నేలలో పోషకాలు పెరిగి సారవంతంగా మారతాయన్నారు. రాయితీపోను జీలుగా కిలో రూ.39.50, జనుము కిలో రూ.42కు విక్రయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోగినేని శ్రీనివాసకుమార అప్పారావు, రైతు సంఘం నాయకులు నిమ్మగడ్డ నరసింహా తదితరులు పాల్గొన్నారు.



గొల్లపల్లి ఆర్‌బీకేలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్న

చాట్రాయి: మండలంలోని చనుబండ రైతు భరోసా కేంద్రంలో గురువారం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, ఉప సర్పంచ్ దిరిశాల చినబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు వనమా వాసు, విస్సంపల్లి రామకృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయ అధికారి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రతి నెలా షష్ఠి రోజున ఆలయ అర్చకులతో నిర్వహించే కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో దుర్గ గుడి ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ కార్యనిర్వహణాధికారి భ్రమరాంబ, ట్రస్ట్ సభ్యులు కట్టా సత్తెయ్య పాల్గొన్నారు. షష్ఠి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవాన్ని తిలకించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



ఇబ్రహీంపట్నం: స్థానిక సెవెంత్‌డే స్కూల్ సమీపంలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై గురువారం ద్విచక్రవాహనం అదుపుతప్పి పల్టీ కొట్టిన ప్రమాదంలో ఓవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గుంటూరుకు చెందిన నారాయణ అనే వ్యక్తి తన వాహనంపై జగ్గయ్యపేటకు వ్యక్తిగత పనులపై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రోడ్డుపై ఉన్న బూడిద కారణంగా వాహనం పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో నారాయణ ఎడమకాలు కింది భాగంలో విరిగింది. తలకు తీవ్ర గాయమై రక్తస్రావం అయింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది బాధితుడిని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఇబ్రహీంపట్నం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సినీరంగ ప్రముఖుల మృతికి సంతాపం



విజయవాడకల్చరల్: తెలుగు కళావాహిని, కళా సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై గురువారం సినీ నటుడు శరత్‌బాబు, సంగీత దర్శకుడు రాజ్ మృతికి సంతాపం వ్యక్తం చేశాయి. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ.. శరత్‌బాబు స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న నటుడని ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటని చెప్పారు. కళావేదిక కన్వీనర్ డేవిడ్‌రాజు మాట్లాడుతూ సంగీత దర్శకుడు రాజ్ ఎన్నో విజయవంతమైన చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించారన్నారు. బీవీ వీరభద్రరావు, దండు చంద్రశేఖర్, బీవీ రామ్మోహన్, ఆర్.చలపతిరావు, గంగాధర్ షబానా, పాల్గొన్నారు. శరత్‌బాబు, రాజ్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

కొత్త ప్రతిపాదనలకు అనుమతి ఇవ్వొద్దని వినతి

పేరంటాళ్ళ గుట్ట(గంపలగూడెం):ప్రజారోగ్యాన్ని పరిగణనలోకి తీసుకొని గుట్ట వద్ద నిర్వహిస్తున్న క్వారీని మూసివేయాలని, కొత్త ప్రతిపాదనలకు అనుమతి ఇవ్వొద్దని ప్రజలు అధికారుల దృష్టికి తెచ్చారు. పేరంటాళ్ళ గుట్ట వద్ద శ్రీలక్ష్మీ స్టోన్‌క్రషర్స్ పక్కన మరో క్వారీ ఏర్పాటుకు అనుమతి కోరుతూ దరఖాస్తు వచ్చిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశానుసారం ప్రజాభిప్రాయాన్ని కోరుతూ గురువారం ప్రజావేదిక నిర్వహించారు. తిరువూరు ఆర్డీఓ వైవీ ప్రసన్నలక్ష్మి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ టి. ప్రసాదరావు ప్రజావేదిక నిర్వహించారు. సమస్యలను దృష్టిలో పెట్టుకొని అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజావేదిక దృష్టికి తెచ్చిన సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్నారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి వీఆర్వో దుర్గారావు, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



నూజివీడు గ్రంథాలయంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



కథలు నేర్పిస్తున్న వెంకటేశ్వరరావు



విద్యార్థుల సందేహాలకు సమాధానాలు చెబుతున్న సత్యనారాయణ

నూజివీడు: పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు ఈ పోటీలు కొనసాగాయి. అనంతరం విద్యార్థులతో కథల పుస్తకాలు, మహనీయుల చరిత్రను తెలిపే పుస్తకాలను చదివించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల తెలియని అనేక విషయాలు తెలుసుకోవచ్చని చెప్పారు. విజ్ఞానం మరింత పెరుగుతుందని అన్నారు. ఉచిత శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు జూన్ 11న బహుమతులు అందజేస్తామన్నారు. సిబ్బంది యశ్వంత్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని గొల్లపల్లిలోని గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు యోగాసనాలు ప్రాక్టీసు చేయించారు. విద్యార్థి దశ నుంచే యోగా, ధ్యానం పట్ల అవగాహన కలిగి ఉండి సాధన చేసినట్లయితే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండవచ్చని గ్రంథాలయాధికారి డొక్కు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో గొల్లపల్లి హైస్కూల్ పీడీ పి.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: ఉత్తమ ఆలోచన, నడవడికి నీతి కథలు రాజమార్గం చూపుతాయని పలువురు ఉపాధ్యాయులు సూచించారు. గోపవరం గ్రంథాలయంలో బ్రాంచి అధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో గురువారం నీతి కథల ప్రాధాన్యాన్ని చిన్నారులకు వివరించారు. విద్యార్థి జీవితంలో చదవాల్సిన పంచతంత్ర కథలు, మర్యాద రామన్న తీర్పులు, పరమానందయ్య శిష్యుల కథలు, తెనాలి రామకృష్ణ, అక్బర్-బీర్బల్ కథలు వాటి ప్రాధాన్యాన్ని ఉపాధ్యాయులు బాలలకు వివరించారు.

మైలవరం:విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విశ్రాంత వ్యవసాయ శాఖాధికారి పి. సత్యనారాయణ తెలిపారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో కథల పుస్తకాలు చదివించి సారాంశం వివరించారు. విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని చనుబండ, చాట్రాయి గ్రామాల్లోని గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపునకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ప్రతి రోజు రకరకాల పుస్తకాలు పఠించడం, నీతి కథలు చెప్పడం, ఆటలాడిస్తుండడంతో విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. గురువారం గోనెసంచులతో పరుగు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు శ్రీకాంత్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన



ప్లాస్టిక్ నిషేధంపై దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చంటిబాబు

ఆగిరిపల్లి: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను నిర్మూలించి ప్రాణాలను కాపాడుకుందామని ఎస్‌ఐ ఎన్.చంటిబాబు అన్నారు. మండలంలోని వట్టిగుడిపాడులో దుకాణదారులకు, హోటళ్ల నిర్వాహకులకు ప్లాస్టిక్ నిషేధంపై గురువారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ చంటిబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వలన వాతావరణం కలుషితమవుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని విడనాడాలన్నారు. ప్లాస్టిక్ వినియోగంపై ప్రభుత్వ ఆంక్షలను ప్రతి ఒక్కరూ పాటించాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా దుకాణాల ముందు వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే దుకాణదారులకు, హోటళ్ల యజమానులకు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.